క్లుప్తంగా

చితంబర స్వామి తిరునాల ప్రారంభం


పూజలందుకుంటున్న చితంబర స్వామి

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో చితంబర స్వామి తిరునాల ప్రారంభమైంది. ఏటా మహాశివ రాత్రి మరుసటి రోజు తిరునాల నిర్వహించడం అనవాయితీ. ఈ సందర్భంగా శుక్రవారం చితంబరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఘనంగా ఉరుసు


అలంకరణలో సిద్దిబాషా దర్గా

తాడిపత్రి అర్బన్: హజరత్ సయ్యద్ సిద్దిబాషా దర్గా ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి దర్గా ముతవల్లి గఫార్ ఇంటి నుంచి పన్నీరు, గంధాన్ని మేళ తాళాలు, ఫకీర్ల జల్సాతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామికి సమర్పించిన అనంతరం పూలచాదర్, గలఫ్ చాదర్‌ను సమర్పించారు. శుక్రవారం ఉదయం దర్గాలో ముతవల్లి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతేహాలు చదివించారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్గాలో ఫాతేహాలు చదివించి ప్రత్యేక ప్రార్థలు చేశారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

గుత్తి రూరల్: వచ్చే ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఎస్ఐ నబీరసూల్‌తో కలసి సీఐ గ్రామసభ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలన్నారు. చిన్న విషయాలకు ఘర్షణలకు పాల్పడి గ్రామాల్లో అల్లర్లు సృష్టించి కేసుల్లో ఇరుక్కొని విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపప్పూరు: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంటకు చెందిన పెడిగప్ప, నాగలక్ష్మి కుమారుడు ఎర్రిస్వామి (27) డిగ్రీ పూర్తి చేసి అనంతపురంలో కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడిన ఎర్రిస్వామి..పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా మహిళా దినోత్సవం


యాడికి మండలంలోని పెద్దపేట సమీపంలో ఉపాధి పనుల వద్ద కేక్ కట్ చేస్తున్న సీఐ

యాడికి: మండలంలోని పెద్దపేట గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద శుక్రవారం సీఐ నాగార్జున రెడ్డి మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఉపాధి పనులు పూర్తయిన తర్వాత కూలీల సమక్షంలో సీఐ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్య క్రమంలో ఎఫ్ఏ గంగాధర్, ఉపాధి మేట్లు పాల్గొన్నారు.


పెన్నా సిమెంట్స్‌లో..

తాడిపత్రి: రూరల్ పరిధిలోని తలారి చెరువు గ్రామం వద్ద ఉన్న పెన్నా సిమెంట్స్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెన్నా రిక్రియేషన్ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, మహిళలు పాల్గొన్నారు.

గుత్తిలో రేపు..

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయి బాబా ఫంక్షన్ హాల్లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు బలిజ సంఘం మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కందుల హేమలత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సన్మానిస్తామన్నారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

పుట్లూరు: మండలంలోని కడవకల్లులో శుక్రవారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

హర హర మహాదేవ.. శంభోశంకర

తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో హర హర మహాదేవ.... శంభోశంకర అంటూ భక్తుల శివనామస్మరణలతో శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. మహా శివరాత్రి పండుగ సందర్భంగా శుక్రవారం శివాలయాలన్నీ భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆలయాల ఆవరణలో కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. భక్తులు రాత్రంతా జాగరణ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


బుక్కరాయసముద్రంలో విద్యుద్దీపాలంకరణలో కాశీ విశ్వేశ్వర ఆలయం


పెద్దవడుగూరు మండలం చింతలచెరువులో శివాలయాన్ని అలంకరించిన దృశ్యం


గుంతకల్లు రూరల్: అలంకరణలో బుగ్గ సంగమేశ్వరుడు


గార్లదిన్నె మండలం కోటంకలో అలంకరించిన 108 సాలాగ్ర శివలింగాలు

తాడిపత్రిఅర్బన్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పెన్నా నదీతీరంలో వెలసిన చారిత్రాత్మక ఆలయం బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి అర్ధరాత్రి నుంచి భక్తులు పోటెత్తారు. పెన్నా నదిలో మాఘ స్నానాలు ఆచరించి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. బుగ్గరామలింగేశ్వరుని దర్శనం కోసం బారులు తీరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో బుగ్గరామలింగేశ్వరస్వామి మూలవిరాట్‌కు తొలిపూజ అర్ధరాత్రే ప్రారంభమైంది. ప్రత్యేక పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే ఎమ్మెల్యే బుగ్గ రామలింగేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలమండలి సభ్యులు, అర్చకులు సన్మానించి, వేద ఆశీర్వచనం చేశారు. అలాగే పట్టణంలోని లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయం, చంద్రమౌళీశ్వర ఆలయం, నాగులకట్ట, సంజీవనగర్‌లోని వేదగాయత్రీమాత ఆలయంలోని అమరలింగేశ్వరస్వామి ఆలయం, కడప రోడ్డులోని భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయాలు భక్తులతోతో కిక్కిరిసిపోయాయి. బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో వాసవీక్లబ్ ,లార్డ్ ఆస్పత్రి నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, నిమ్మరసం, వడపప్పు, పానకం అందజేశారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వరాలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వరాలయంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. గుంతకల్లు చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాకుండా కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో పవిత్ర స్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి పార్వతీ సంగమేశ్వరుల కల్యాణోత్సవం చేపట్టారు. అలాగే కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి అనుబంధ దేవాస్థానమైన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఏకాదశవార రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. దోనిముక్కల విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుంతకల్లు టౌన్: పట్టణంలోని పాతగుంతకల్లు రామలింగేశ్వర స్వామి, కసాపురం రోడ్‌లోని పాతూరు శివాలయం, భవానీ చంద్రశేఖరస్వామి, తదితర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజల అనంతరం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే పట్టణంలోని హంపేకార్ వీధిలో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శివరాత్రి వేడుకలు నిర్వహించారు.

గుత్తి/రూరల్: గుత్తిలోని కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, అప్పయ్య దేవాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద రథోత్సవం చేపట్టారు. అలాగే తొండపాడు, ధర్మాపురం, చెర్లోపల్లి, ఊబిచెర్ల, మాముడూరు, రజాపురం గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా ఆలయాలకు భక్తులు పొటెత్తారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం, నగరేశ్వరాలయం, కన్యకా పరమేశ్వరాలయం, విఠోబ ఆలయం, మడికట్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, పానకం అందజేశారు. భోగేశ్వరాలయం వద్ద పామిడి ఆయుర్వే వైద్యాధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నెలరోజుల పాటు భజనలు చేసిన భక్తులకు, సేవలకు ఆలయ ప్రెసిడెంట్ ఎస్.మురళీధర్‌గుప్తా ఆధ్వర్యంలో ఈఓ ఏఈ క్రిష్ణయ్య సమక్షంలో సత్కరించారు. రాత్రి శివపార్వతుల ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం చేపట్టారు. స్థానిక భోగేశ్వరాలయంలో భజన మండలి సభ్యులకు ఆలయ ప్రధాన అర్చకులు సోమశంకర్ శర్మ, రామేశ్వరశర్మ, చంద్ర, అనిల్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

శింగనమల: మండలంలోని శివాలయం, చిన్న జలాలపురంలోని దోణరామేశ్వరుడు, శింగనమల సమీపంలోని కొండ పైనున్న రుష్యశృంగుడు, శివపురంలోని శివాలయం, తరిమెల గ్రామంలోని శివాలయం, కల్లుమడిలో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో 108 సాలాగ్ర శివలింగాలకు రుద్రాభిషేకం, అర్చనలు, పూజలు ఘనం గా నిర్వహించారు. అలాగే గార్లదిన్నె, కమలాపురం,కల్లూరులో శివపార్వతుల కల్యాణం వైభవంగా చేపట్టారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్టవద్ద ఉన్న కాశీ విశ్వేశ్వర ఆలయం శివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసి పోయింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నీలాంపల్లిలోని నాగలింగేశ్వర దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

యాడికి: మండల కేంద్రంలో పార్వతీ సమేత భోగలింగేశ్వరుడు, భైరవేశ్వర ఆలయం, రాయల చెరువు గౌరీ శంకర దేవాలయం, చందన రామలింగేశ్వర దేవాలయం, చిక్కేపల్లె , నిట్టూరు తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులో కిటకిటలాడాయి. కోనుప్పలపాడులోని కోన క్షేత్రంలో తిరుణాల సందర్భంగా కోనా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు దేవాలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. తిరునాల సందర్భంగా గాజుల అంగళ్లు, స్వీట్ స్టాల్స్ వెలిశాయి. తిరుణాలకు వచ్చిన భక్తులు నీటి గుండంలో స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. చింతలచెరువు గ్రామంలో జోడి లింగాల ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. చిన్నవడుగూరు గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యల్లనూరు: మండలంలోని కోటవీధి, యల్లనూరు, నిట్టూరు, తిమ్మంపల్లి, చింతకాయమంద, కల్లూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని మేడికుర్తి గ్రామంలో అవధూత బుచ్చమ్మ అమ్మవారి సన్నిధిలోమేడికుర్తి సర్పంచు, సచివాలయాల మండల కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి నాటక మండలి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన నిర్వహించారు.

బుగ్గ రామలింగేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ప్రసిద్ధ శైవక్షేత్రం పార్వతీదేవి సమేత బుగ్గరామలింగేశ్వరుడిని ఎమ్మెల్యే పెద్దారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే చేత అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులను అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయం కమిటీ సభ్యులు, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. క్యూలైన్ల ఏర్పాట్లపై భక్తులతో ఆరా తీశారు. అంతకు ముందు దేవాలయ ముఖ ద్వారాన్ని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ కమిటీ అధ్యక్షుడు పొలిశెట్టి ఆంజనేయులు, సభ్యుడు అంబటి రాఘవ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కందిగోపుల మురళి, ఈఓ సుబ్రమాణ్యం తదితరులున్నారు.

భీమలింగేశ్వరుడి సేవలో..

పెద్దపప్పూరు: శివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి, చక్రభీమలింగేశ్వరుడిని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేను సత్కరించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.


తాడిపత్రి రూరల్: బుగ్గ రామలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


అలంకరణలో పార్వతీదేవి


యాడికి మండలం చందనలో రామలింగేశ్వరుడు


శింగనమల: చిన్నజలాలపురం దోణరామేశ్వరుడు


పెద్దవడుగూరు : చిన్నవడుగూరులో శివున్ని అలంకరించిన దృశ్యం


గుత్తి: శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు


కసాపురంలో పూజలందుకుంటున్న కాశీ విశాలాక్షి సహిత విశ్వేశ్వర స్వామి


గుంతకల్లు టౌన్: భవానీ చంద్రశేఖర్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హత్యాయత్నం కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని పెనచచెర్లకు చెందిన ఎర్రిస్వామిపై హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురానికి చెందిన లలిత, సరిత అక్కచెల్లెళ్లు. వీరిద్దరినీ గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెందిన వేర్వేరు కుటుంబాలకు చెందిన యువకులతో వివాహమైంది. కొన్నేళ్ల క్రితం లలిత కుటుంబసభ్యులు బతుకు తెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం కుటుంబ కలహాల కారణంగా సరిత తన భర్త ఎర్రిస్వామితో గొడవపడి హైదరాబాద్‌లోని సోదరుడు వేణు ఇంటికి చేరుకుంది. అప్పటినుంచి ఆమె కాపురానికి రాలేదు. ఇటీవల వేణు పెనకచెర్లలోని పెద్ద అక్క లలిత ఇంటికి రాగా.. ఎర్రిస్వామి శుక్రవారం అతడిపై దాడి చేశాడు. ఎర్రిస్వామిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం

యాడికి: ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించే లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో చెన్నకేశవస్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా విధులను సక్రమంగా నిర్వహించాలని తెలుపుతూ ఆయకట్టుదారులకు తాంబూళాలు అందజేశారు. ప్రధాన అర్చకుడు హరికృష్ణ శర్మ, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, ఆలయ ధర్మకర్త బొంబాయి రామిరెడ్డి, ఎంపీటీసీలు వెంకట నాయుడు, అవుకు నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు క్రిష్ణయ్య, శ్రీరాములు, రామయ్య, నాగరంగయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


జేకేఎస్‌లో ముస్లిం మతపెద్దలకు రూ.2 లక్షలు అందజేస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు, ఆలూరు రమణారెడ్డి


గార్లదిన్నె మండలం మర్తాడులో పర్యటించిన శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని శింగనమల నియోజక వర్గం వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం బీకేఎస్ మండల కేంద్రంలోని ఎల్‌బీ కాలనీలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. అనంతరం కాలనీలో ఉపాధి పథకం కింద రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే..

మండల కేంద్రంలోని జన చైతన్య నగర్ కాలనీలో మసీదు కాంపౌండ్ నిర్మాణం చేపట్టాలని ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దృష్టికి కాలనీవాసులు తీసుకు వచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే సొంత నిధులు వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలూరు రమణారెడ్డి చేతులు మీదుగా రూ.2 లక్షలను ప్రహరీ నిర్మించుకునేందుకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, మండల కన్వీనర్ అంకే నరేష్, వైస్ ఎంపీపీ రామగోపాల్, ఎంపీటీసీ సుజాత, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, పూల నారాయణస్వామి, ఉప సర్పంచ్ వరలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్లు వరికూట కాటమయ్య, సాకే లక్ష్మీనారాయణ, బుల్లే రాజా, శ్రీనివాసరెడ్డి, పూల రంగా, పురుషోత్తం, సాయి, శేషానందరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అంజి, లచ్చి తదితరులు పాల్గొన్నారు.

- గార్లదిన్నె మండలంలోని కోటంక, మర్తాడు ఎస్సీ కాలనీల్లో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు పర్యటించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కక్షలు వీడి శాంతియుతంగా జీవించండి


తాడిపత్రిలో ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణ అనంతరం జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి


పెద్దపప్పూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పచ్చని గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి సూచించారు. పట్టణంలో శుక్రవారం తాడిపత్రి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాతంతద్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని దాత, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలన్నారు. గ్రామాలను కక్షలుగా మార్చి నాశనం చేసే రాజకీయాల జోలికి వెళ్లరాదని ప్రజలను కోరారు. గ్రామాలు ఎప్పుడు ప్రశాంతంగా ఉంటాయో అప్పుడు మహానీయుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రెడ్డి కులస్తులు ఐకమత్యంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం విగ్రహ దాత ఎమ్మెల్యే పెద్దారెడ్డి, విగ్రహ పీఠం ఏర్పాటు కోసం విరాళం ఇచ్చిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పేరం నాగిరెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం కమిటీ శాలువా, జ్ఞాపికలతో సన్మానించింది. అనంతరం విగ్రహావిష్కరణకు హాజరైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వారసుడు మహేంద్రతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ముచ్చటించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

పెద్దపప్పూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమపథకాలు అందుతున్నాయని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పెద్దపప్పూరులో సచివాలయం–2ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పభుత్వ సేవలు అందుబాటులో ఉండాలన్న లక్ష్యంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి రాజకీయ పలుకుబడి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామి రెడ్డి (రామయ్య), మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమర్‌నాథరెడ్డి, సర్పంచు ఓబులమ్మ, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, షేక్‌పల్లి నాగిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, నారాపురం రామ్మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల భాగస్వామ్యంతో శివాలయ అభివృద్ధి

తాడిపత్రిరూరల్: పట్టణంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం పార్వతీదేవి సమేత బుగ్గరామలింగేశ్వర దేవాలయంలో తన హయంలో భక్తుల భాగస్వామ్యంతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలిపారు. శివరాత్రిని పురస్కరించుకుని భక్తుల విరాళాలతో 55 అడుగుల పొడవు, 22 అడుగుల వెడల్పుతో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వారం ప్రారంభించడంతోపాటు భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పొలిశెట్టి ఆంజనేయులు, సభ్యుడు అంబటి రాఘవేంద్రారెడ్డితో కలసి ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తన హయాంలో ఆలయం వద్ద దాదాపు రూ.16 లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మించామన్నారు. అలాగే దేవాలయం ఎదుట భక్తుల విరాళాలు రూ.18 లక్షల వ్యయంతో భారీ నంది విగ్రహం ప్రతిష్టించామన్నారు. భవిష్యత్‌లో దేవదాయశాఖ తరపున నిధులను మంజూరు చేయించి మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కౌన్సిలర్ కప్పలబండ సుచరిత శుక్రవారం చర్యలు తీసుకున్నారు. ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయించారు. వేసవి ముగిసే వరకూ రోజూ ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయిస్తామని కౌన్సిలర్ తెలిపారు.